సాక్షి మహబూబాబాద్

సోమవారం | 17 | మార్చి | 2025



డిమాండ్ ఎంతైనా.. సరఫరా చేస్తాం

వేసవిలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్నా.. ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. - 8లో ▸



'రవాణా భత్యం' మంజూరు

దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యం మంజూరు చేసింది. - 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39^0 / 19.1^0

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రిపూట కాస్త ఉక్కపోతగా ఉంటుంది.





సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



బహిరంగ సభకు హాజరైన ప్రజలు, రిమోట్ ద్వారా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య, ప్రజాప్రతినిధులు

హైదరాబాద్‌తో పోటీ పడేలా..

ఓరుగల్లు అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి హామీ

- పక్కాగా సంక్షేమ పథకాల అమలు
- మామునూరు ఎయిర్ పోర్ట్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కాంగ్రెస్ ఘనతే..
- ప్రతిష్టాత్మకంగా విమానాశ్రయాన్ని నిర్మిస్తామని స్పష్టీకరణ
- విద్య, వైద్యం, పర్యాటక, ఐటీ హబ్‌గా ఓరుగల్లుకు ప్రాధాన్యం..
- ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభ విజయవంతం

సాక్షి ప్రతినిధి, వరంగల్/జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ శివారు శివునిపల్లిలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఓరుగల్లుపై వరాల జల్లు కురిపించారు. మరోవైపు బీఆర్ఎస్, కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులపై విమర్శలు గుప్పించారు. శివునిపల్లిలో ఈ కార్యక్రమం రాజకీయ పార్టీగా ఏర్పాటు చేసింది కాదని, ఓట్ల కోసం రాలేదన్న ఆయన.. స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధిలో భాగంగా రూ.800 కోట్ల నిధులతో ప్రగతి కోసం తలపెట్టిన బహిరంగ సభ అని స్పష్టం చేశారు. వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌తో పోటీ పడేలా అభివృద్ధి చేస్తామని, ఆర్థికంగా ఇబ్బందులున్నప్పటికీ ఇందు కోసం ఎన్ని నిధులైనా కేటాయిస్తామని ప్రకటించారు. మరోవైపు వరంగల్ అంటే తనకు ప్రత్యేక అభిమానమన్న ముఖ్యమంత్రి.. ఉమ్మడి జిల్లాను విద్య, వైద్యం, పర్యాటక, ఐటీ హబ్‌లుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. సీఎం సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

కడియం శ్రీహరిని నేనే రమ్మన్నా..

ఈ ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్‌కు రింగ్‌రోడ్డు వచ్చాయని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఎంపీ కడియం కావ్య ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా జీఎంఆర్ నుంచి క్లియరెన్స్ తీసుకుని కేంద్ర మంత్రులను కలిసి ఎయిర్‌పోర్టు సాధించామని తెలిపారు. అలాగే, రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని సాధించామని, కాజీపేట రైల్వే డివిజన్ చేయడం కోసం ఎంపీ కావ్యతోపాటు తన కృషి ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. వరంగల్ నగరంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, ఔటర్ రింగ్‌రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డుతోపాటు పలు అభివృద్ధి పథకాల కోసం రూ.6,500 కోట్లు మంజూరు చేశామని, త్వరలోనే ఆ పనులు మొదలవుతాయన్నారు. జయశంకర్ సర్ స్వగ్రామం అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా చేసింది ఈ ప్రభుత్వమేనన్న ఆయన.. మహిళలకు వెయ్యి బస్సులు ఇచ్చి ఆర్టీసీలో అద్దెకు తీసుకున్నామని చెప్పారు. మహిళల చేత వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయించడం ద్వారా ఉమ్మడి వరంగల్‌కు చెందిన మహిళలకు మేలు జరిగిందని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ హాస్టల్, వంద పడకల ఆస్పత్రి, ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు వంటి శాశ్వత ప్రాతిపదికన స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.800 కోట్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడ్డాక కడియం శ్రీహరి సేవలు గుర్తెరిగి ఆయన నిజాయితీ, అనుభవం కావాలని, తానే అక్కున చేర్చుకొని పార్టీలో చేరాలని కోరినట్లు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మా కోరిక మేరకు ఆయన పార్టీలో చేరగా.. చెల్లెలు డాక్టర్ కావ్యను ఎంపీగా గెలిపించారన్నారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తికావాలంటే శ్రీహరి నాయకత్వాన్ని బలపర్చాలని ప్రజలను కోరారు.

కేసీఆర్, ఆయన కుటుంబంపై ఘాటైన విమర్శలు..

జనగామ జిల్లా శివునిపల్లి వేదికగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుటుంబంపై సీఎం రేవంత్‌రెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, టి.హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపైన ఆయన కామెంట్స్ చేశారు. 'అధికారం ఉంటే తప్ప కేసీఆర్ ప్రజల్లోకి రాలేరా? ఆయన బయటకు రాకుండా కొడుకు, అల్లుడిని ఊరు మీదకు వదులుతున్నారు. బయటకు రానప్పుడు ఆయనకు ప్రతిపక్ష హోదా ఎందుకు? జీతభత్యాలు ఎందుకు?.. ఇలా చేస్తేనే కదా కాంగ్రెస్ దెబ్బ ఎలా ఉంటుందో 2023లో ప్రజలు చూపించారు' అంటూ విమర్శలు చేశారు. 'క్యాప్సికం పండిస్తే రూ.కోట్లు వస్తాయన్న కేసీఆర్.. ఆ టెక్నిక్ ఏంటో ప్రజలకు చెప్పండి.. నీ లక్ష కోట్ల సంపాదన నైపుణ్యం ఏంటో ప్రజలకు చెప్పండి.. వెయ్యి మంది యువకులను నీ ఫామ్ హౌస్‌కు పంపిస్తాం. ఆ టెక్నిక్ ఏంటో వారికి నేర్పించండి' అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకుని పేపర్, టీవీ చానళ్లు పెట్టుకున్న వ్యక్తి జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆయనతోపాటు కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు ఫామ్‌హౌస్‌లు ఎక్కడినుంచి వచ్చాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ, ఎంపీలు కడియం కావ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, పోరిక బలరాంనాయక్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, నాయకులు ఝాన్సీరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య పాల్గొన్నారు.

ఓరుగల్లు చరిత్ర గొప్పది.. అందుకే ప్రత్యేక అభిమానం..

ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందని సీఎం రేవంత్ అన్నారు. రాణి రుద్రమదేవి మొదలుకుని సమ్మక్క, సారలమ్మ వరకు, ప్రతాపరుద్రుడు మొదలుకుంటే గొప్పగొప్ప మేధావులు, నాయకులైన కాళోజీ నారాయణరావు, జయశంకర్, దాశరథి, పాలకుర్తి సోమన్న, సర్దార్ సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ ఉద్యమ చైతన్యం కలిగిన ప్రాంతం ఇదని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమసాధన సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి అని అభివర్ణిస్తూ.. తెలంగాణ ఉద్యమంతోపాటు ప్రజా ఉద్యమాలతో సమస్యల పరిష్కారానికి కాకతీయ విశ్వవిద్యాలయం కీలక ప్రాతినిధ్యం వహించిన గడ్డ ఇదన్నారు. నాటి ప్రత్యేక రాష్ట్రసాధన ఉద్యమంలో నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష కోసం ఉస్మానియా యూనివర్సిటీతోపాటు కాకతీయ యూనివర్సిటీ క్రియాశీలకపాత్ర పోషించాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన ఓరుగల్లు అంటే తనకు ప్రత్యేక అభిమానమని, ఈ ప్రాంత అభివృద్ధికి తాను, తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

సీఎం బహిరంగ సభ సైడ్‌లైట్స్

మధ్యాహ్నం 1.38 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో సభాస్థలికి చేరుకున్నారు.

1.42 గంటలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య స్వాగతం పలికారు.

1.44 గంటలకు సీఎం కాలినడకన బస్సు వద్దకు చేరుకున్నారు.

1.45 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కాన్వాయ్‌లో మహిళా సంఘాలు, ఆయా శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ వద్దకు చేరుకున్నారు.

1.48 గంటలకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సీఎం స్టాల్స్‌ను సందర్శించారు.

1.51 గంటలకు ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళలకు అందజేసిన ఏడు ఆర్టీసీ బస్సులను ప్రారంభించారు.

1.52 గంటలకు పెంబర్తి హస్తకళలు, సిలికాన్ కాటన్ టెక్స్‌టైల్, ఫుడ్ ప్రొడక్ట్స్, ఐసీడీఎస్ స్టాళ్లను సందర్శించారు.

1.55 గంటలకు పట్టుపరిశ్రమ, ఉద్యాన శాఖ స్టాళ్లను సందర్శించారు.

1.57 గంటలకు సీఎం సభావేదిక పైకి చేరుకున్నారు.

2 గంటలకు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

2.01 గంటలకు తెలంగాణ రాష్ట్ర గీతాలాపన చేశారు.

2.04 నుంచి 2.07 గంటల వరకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.800 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పలు ప్రారంభోత్సవాలు వర్చువల్‌గా రిమోట్ ద్వారా చేశారు.

2.54 నుంచి 3.28 గంటల వరకు 34 నిమిషాల పాటు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు.

అనంతరం ముఖ్యమంత్రికి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పెంబర్తి హస్తకళా ఖండాన్ని బహూకరించారు. అలాగే గొల్లకురుమలు, ముదిరాజ్‌లు, పలువురు సత్కరించారు.

3.40 గంటలకు సీఎం హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయల్దేరారు.

రేవంత్ టీ-20 మ్యాచ్ ఆడుతున్నారు..

- నవాళ్లు, ప్రతి నవాళ్లు ఎదుర్కొంటూ ప్రజాపాలన సాగిస్తున్నారు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



రూ.630.27 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

-8లో

సీఎం సభలో తెలంగాణ ఉద్యమ కళాకారుల నిరసన







సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య, మహిళా సంఘాల బస్సులను ప్రారంభిస్తున్న సీఎం, ముఖ్యమంత్రికి స్టాళ్లలోని వస్త్రాలు చూపుతున్న మహిళలు

న్యూస్‌రీల్

పన్ను చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తాం..



తొర్రూరు: మున్సిపాలిటీ పరిధిలో నివాసముండే ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను, ఇతర పన్నులు చెల్లించాలని, లేని పక్షంలో ఆస్తులు జప్తు చేస్తామని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. పన్నులు చెల్లించని వారి నల్లా కనెక్షన్ తొలగిస్తామని, ఇతర సౌకర్యాలు రద్దు చేస్తామన్నారు. గతేడాది 90 శాతం పన్నులు వసూలు చేశామని, ఈ ఏడాది 100శాతం పన్నుల వసూలే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ కట్టా స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష ప్రశాంతం



కురవి: సీరోలు, కురవి మండల కేంద్రాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు పాఠశాలల ప్రిన్సిపాళ్లు సంతోష్‌సోని, లాలు ఆదివారం తెలిపారు. సీరోలు పరీక్ష కేంద్రంలో 400 మందికి 370మంది విద్యార్థులు హాజరై.. 30 మంది గైర్హాజరయ్యారు. కురవి సెంటర్‌లో 457 మందికి 409 మంది విద్యార్థులు హాజరుకాగా 48మంది గైర్హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాల వద్ద కురవి, సీరోలు ఎస్సైలు గండ్రాతిసతీశ్, నగేశ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

20న జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 20న ఉదయం 8 గంటలకు అండర్ 14, 16, 18, 20 బాలబాలికలకు జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బన నాగమణి ఆదివారం తెలిపారు. జిల్లా స్థాయిలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23న రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 90526 70288 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

కార్పొరేట్ రాయితీలకే కేంద్ర బడ్జెట్



నెహ్రూసెంటర్: కార్పొరేట్, బహుళజాతి కంపెనీల రాయితీల కోసం కేంద్ర బడ్జెట్‌లో ఏడు లక్షల కోట్ల రూపాయలు కేటాయించారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. సీపీఎం నేత అల్లి శ్రీనివాస్‌రెడ్డి సంస్మరణ సభ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ... కార్పొరేటర్లకు, ఆదానీ, అంబానీలకు బడ్జెట్‌లో రాయితీలతో పాటు 14 లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారని ఆరోపించారు. రైతు, ప్రజలను విస్మరించిన బీజేపీని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర విమర్శలు చేసుకోవడం తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. చివరి శ్వాస వరకు పేదల కోసం పోరాడిన అల్లి శ్రీనివాస్‌రెడ్డి పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య, నాయకులు జి.రాములు, సూడి కృష్ణారెడ్డి, సాదుల శ్రీనివాస్, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, శెట్టి వెంకన్న, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, కందుకూరి శ్రీనివాస్, సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, గాడిపెల్లి ప్రమీల పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీ పోరిక బలరాం నాయక్ అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని సోషల్ మీడియా కో ఆర్డినేటర్లకు ఐడీ కార్డులు, ఇన్సూరెన్స్ కాపీలు, డైరీలను ఎంపీ ఆదివారం అందజేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను కాపాడుకుంటామని తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని జిల్లా, నియోజకవర్గ, మండల కో ఆర్డినేటర్లకు టీపీసీసీ సోషల్ మీడియా చైర్మన్, టీజీటీఎస్ చైర్మన్ మన్నె సతీశ్‌కుమార్ సహకారంతో టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి అంబాల శివకుమార్ ఆధ్వర్యంలో ఐడీ కార్డులు, ఇన్సూరెన్స్ కాపీలు, డైరీలు అందజేశామని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, నిరుద్యోగులకు 55వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో బయ్యారం పీఏసీఎస్ డైరెక్టర్ జూలకంటి సీతారాంరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సామ మధుసూదన్ రెడ్డి, పినపాక, భద్రాచలం, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు దునుకు రాము, ప్రేమ్, గుగులోతు నవీన్, తవిశెట్టి రాకేష్, షేక్ ఖాజాపాషా, గుగులోతు రమేశ్, నాగేంద్రబాబు, నాళ్ల కిరణ్, మాలిక్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్సూరెన్స్ కాపీలను అందజేస్తున్న ఎంపీ

తాగునీటి కష్టాలు

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పట్టణ నడిబొడ్డున ఉన్న రెడ్డి బజారుకు మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా సరఫరా కావడం లేదు. సన్నటి ధారగా వస్తుండడంతో నీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఈమేరకు పిల్లలు పైపుల ద్వారా నీటిని పడుతున్న చిత్రం ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కింది. అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా.. తాగునీటి సమస్య పరిష్కరించడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.



భగీరథ నీటిని పడుతున్న చిన్నారులు

పేదలకు వరం సీఎం సహాయ నిధి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. మొత్తం 104 మంది లబ్ధిదారులకు రూ.33.93 లక్షల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిదని తెలిపారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక సహాయం అందిస్తూ పేదల పెన్నిధిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, నాయకులు గంజి విజయ్‌పాల్‌రెడ్డి, సోమ రాజశేఖర్, ముద్దసాని సురేష్, చిత్తలూరి శ్రీనివాస్, మేకల కుమార్, మొగుళ్ల లింగన్న, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పనులు చేపట్టేదెప్పుడో..?

- బైపాస్ రోడ్డు పనులకు అడ్డంకిగా మారిన భూసేకరణ
- ముగింపునకు రైల్వే ఫ్లైఓవర్‌బ్రిడ్జి పనులు

డోర్నకల్: డోర్నకల్‌లో బైపాస్ రోడ్డు పనులకు భూసేకరణ అడ్డంకిగా మారింది. గార్ల నుంచి డోర్నకల్ మీదుగా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గార్ల గేటు, రైల్వే ఆస్పత్రి, గాంధీసెంటర్, గండి సత్యనారాయణ మిల్లు, యాదవనగర్ మూలమలుపులు ఇరుకుగా, బ్యాంక్ స్ట్రీట్ నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురుకావడంతో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

2023లో..

రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో రూ.6 కోట్ల నిధులతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి 2023 అక్టోబర్ 2న అప్పటి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. 90వ లెవల్ క్రాసింగ్ గార్ల గేటు నుంచి గొల్లచర్ల–డోర్నకల్ ఆర్ అండ్ బీ రోడ్డులోని సమ్మర్ స్టోరేజ్ సమీపాన ప్రస్తుతం ఉన్న బైపాస్ రోడ్డును అనుసంధానిస్తూ కొత్త బైపాస్ రోడ్డు వేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే నాటి నుంచి నేటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

భూసేకరణే అడ్డంకి...

గార్ల గేటు వద్ద చేపట్టిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి సమ్మర్ స్టోరేజ్ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 1.7కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం కొంతమేర రోడ్డు ఉండగా.. మిగిలిన రోడ్డు కోసం 8ఎకరాల భూ సేకరణ చేపట్టాలని రెవెన్యూశాఖ అధికారులు గుర్తించారు. 28 మంది రైతుల నుంచి 8ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా ఇందులో 6 ఎకరాలు డోర్నకల్ పట్టణ పరిధిలో.. 2ఎకరాలు గార్ల మండలం బుద్ధారం గ్రామ పరిధిలో ఉంది. రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించి సేకరించాల్సిన భూమిని గుర్తించి రైతులకు సమాచారం అందించగా ఒకరిద్దరు రైతులు భూమి ఇచ్చేందుకు ఒప్పుకోకపోవడంతో రోడ్డు పనులు ప్రారంభం కాలేదు.

భూమి అప్పగిస్తే..

రెవెన్యూ సిబ్బంది తమకు భూమి అప్పగిస్తే రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బీ అధికారులు చెబుతున్నారు. కాగా భూసేకరణ పూర్తి చేసి బైపాస్ రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ గతంలో మహబూబాబాద్ ఆర్డీఓకు లేఖ రాశారు. ప్రస్తుతం ఉన్న బైపాస్ రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా నూతన బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే డోర్నకల్‌లో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అధికారులు వెంటనే స్పందించి భూసేకరణ పూర్తి చేసి బైపాస్ రోడ్డు పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



ముగింపు దశలో రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి

పోలీసులకు చిక్కిన కొత్త హరిబాబు?

- రాజలింగమూర్తి హత్య కేసులో ఏ–8గా కేసు నమోదు
- క్రెడిట్‌ కార్డు వినియోగం ఆధారంగా పట్టుకున్న ప్రత్యేక టీం
- ఢిల్లీ నుంచి కారులో భూపాలపల్లికి తీసుకొచ్చిన పోలీసులు?

భూపాలపల్లి: సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కొత్త హరిబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి పట్టణానికి చెందిన రాజలింగమూర్తి గత నెల(ఫిబ్రవరి) 19న రాత్రి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్యకు పాల్పడిన, సహకరించిన ఏడుగురిని ఫిబ్రవరి 23న ఎస్పీ కిరణ్‌ ఖరే అరెస్ట్‌ చూపించారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఏ–9గా ఉన్న పుల్ల నరేశ్‌ను ఈ నెల1వ తేదీన పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఏ–8గా ఉన్న భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్‌ చైర్మన్‌, బీఆర్‌ఎస్‌ నాయకుడు కొత్త హరిబాబు, ఏ–10గా ఉన్న పుల్ల సురేశ్‌ కోసం నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా, కొత్త హరిబాబు ఈ నెల 4వ తేదీన ముందస్తు బెయిల్‌ పిటిషన్‌ కోసం హైకోర్టును ఆశ్రయించాడు. బెయిల్‌ పిటిషన్‌పై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయి. నేడు(సోమవారం) సైతం హైకోర్టులో వాదనలు జరుగనున్నాయి. ఈ క్రమంలోనే హరిబాబును ప్రత్యేక టీం పోలీసులు ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

క్రెడిట్‌ కార్డు ఆధారంగా పట్టివేత..

రాజలింగమూర్తి హత్య కేసు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయంగా చర్చనీయాంశం అయ్యింది. దీంతో హత్య కేసులో ఏ–8 నిందితుడిగా ఉన్న కొత్త హరిబాబును పట్టుకునేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే మొబైల్‌ఫోన్‌ను వినియోగించకపోవడంతో అతడు ఎక్కడ ఉన్నాడనేది పోలీసులు గుర్తించలేకపోయారు. ఢిల్లీలో ఉన్నట్లు అనుమానించిన పోలీసులు కొద్ది రోజులుగా అక్కడ మకాం వేసి గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే అతడు క్రెడిట్‌ కార్డును పలుచోట్ల వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. సమీప ప్రాంతాలపై నిఘా వేసి శనివారం రాత్రి హరిబాబును పట్టుకొని కారులో బయలుదేరి ఆదివారం రాత్రి భూపాలపల్లికి చేరుకున్నట్లు తెలిసింది. అర్ధరాత్రే అరెస్ట్‌ చూపించి, జడ్జి ఎదుట హాజరుపరిచి, జడ్జి ఆదేశాల మేరకు జైలుకు పంపించనున్నట్లు సమాచారం.

ఇద్దరు మిలీషియా సభ్యుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టులను చూపిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు మిలీషియా సభ్యులు లొంగిపోయినట్లు ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఆదివారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్ల డించారు. ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రానికి చెందిన మావోయిస్టు పార్టీ సీఎన్‌ఎం సభ్యుడు మడవి కోస, మరో సభ్యురాలు మడకం సోడి అలియాస్‌ జోగి పార్టీ సిద్ధాంతాలు నచ్చక లొంగిపోయినట్లు పేర్కొన్నారు. వీరు పోలీసుల సమాచారాన్ని పార్టీ నాయకత్వానికి చేరవేయడంతోపాటు పలు విధ్వంసాలకు పాల్పడినట్లు చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. స్వేచ్ఛగా జీవించేలా పోలీసులు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్‌ అసిస్టెంట్‌ కమాండెంట్‌ శ్రీనివాస్‌, వెంకటాపురం సీఐ బండారి కుమార్‌, వెంకటాపురం ఎస్సై తిరుపతిరావు, సెకండ్‌ ఎస్సై నర్సింహ పాల్గొన్నారు.

డిమాండ్‌ ఎంతైనా.. సరఫరా చేస్తాం



- వేసవిలో పెరగనున్న విద్యుత్‌ డిమాండ్‌
- ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్న ఎన్పీడీసీఎల్‌
- పైలెట్‌ ప్రాజెక్టుగా ఇండోర్‌ సబ్‌స్టేషన్ల నిర్మాణం
- టీజీ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌రెడ్డి
- 'సాక్షి'కి ఇంటర్వ్యూ

హన్మకొండ: 'వేసవిలో విద్యుత్‌ డిమాండ్‌ భారీగా పెరుగనుంది. పెరుగుతున్న డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి ప్రణాళిక రూపొందించుకుని ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. ఈఏడాది ఫిబ్రవరి నుంచి డిమాండ్‌ పెరిగింది. రోజురోజుకూ పెరుగుతోంది. వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈనెల 11న (మంగళవారం) ఉదయం అత్యధికంగా 5,815 మెగావాట్ల విద్యుత్‌ డిమాండ్‌ పెరిగింది. గతేడాది ఇదే రోజు 5,468 మెగావాట్ల విద్యుత్‌ డిమాండ్‌ నమోదైంది. గతేడాదితో పోలిస్తే 347 మెగావాట్ల విద్యుత్‌ డిమాండ్‌ పెరిగింది' అని టీజీ ఎన్పీడీసీఎల్‌ చైర్మన్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అవన్నీ ఆయన మాటల్లోనే..

సాంకేతికతలో అభివృద్ధి..

ఎన్పీడీసీఎల్‌లో సాంకేతికతను అభివృద్ధి చేశాం. ప్రతీ పనిని ఆన్‌లైన్‌ ద్వారా చేస్తున్నాం. కొత్త సర్వీస్‌ కనెక్షన్లు, లైన్‌ షిఫ్టింగ్‌, ఫిర్యాదులు, దరఖాస్తుల స్థితిగతులు, చెల్లింపులు అన్నీ కూడా ఆన్‌లైన్‌ ద్వారా చేపడుతున్నాం. రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండేలా.. ఎస్టిమేట్‌ వివరాలు తెలుగులో అందిస్తున్నాం. భారీ వర్షాలు, ఈదురు గాలులు, సాంకేతికంగా విద్యుత్‌ సమస్యల వల్ల ఏర్పడే అంతరాయాలను తగ్గించేందుకు.. ఎమర్జెన్సీ పవర్‌ రీస్టోర్‌ టీం వాహనాలను వాడుతున్నాం. ఇందులో అవసరమైన మెటీరియల్‌ అందుబాటులో ఉంటుంది. పాత సబ్‌స్టేషన్లను పునరుద్ధరిస్తున్నాం. సుదూర లైన్ల మధ్యలో ఏబీ స్విచ్‌లు పెడుతున్నాం. ఫాల్ట్‌ ప్యాసేజ్‌ ఇండికేటర్లు కూడా పెట్టాం. తద్వారా అంతరాయాలు త్వరితగతిన గుర్తించి పునరుద్ధరిస్తున్నాం.

పేపర్‌ లెస్‌ వర్క్‌..

ఈ–స్టోర్స్‌ విధానం ద్వారా కావాల్సిన మెటీరియల్‌ ఆన్‌లైన్‌ ద్వారా రిజర్వ్‌ చేసుకుని కావాల్సిన సమయానికి మెటీరియల్‌ను పొందుతున్నాం. దీంతో పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. పేపర్‌ పని లేకుండా ఆన్‌లైన్‌ ద్వారా బుక్‌ చేసి మెటీరియల్‌ డ్రా చేసుకునే సౌలభ్యం క్షేత్రస్థాయిలో అధికారులకు కలిగింది. తద్వారా రైతులకు, వినియోగదారులకు పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రతీ పనిలో అధునాతన సాంకేతిక పద్ధతులు అవలంబిస్తున్నాం. సాంకేతికపరంగా మరిన్ని అంశాలు జోడించి టీజీ ఎన్పీడీసీఎల్‌ యాప్‌ను 19 ఫీచర్లతో రూపొందించాం.

సత్వరమే లోపాల గుర్తింపు..

విద్యుత్‌ సరఫరాలో లోపాల్ని ఆన్‌లైన్‌ ద్వారా సత్వరమే గుర్తించి పరిష్కరించడానికి 11 కేవీ ఫీడర్లకు.. ఫీడర్‌ అవుటేజ్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టం అమల్లోకి తీసుకురానున్నాం. విద్యుత్‌ లైన్‌లో ఎక్కడ లోపం ఏర్పడి విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగిందో ఈటెక్నాలజీ ద్వారా ఆటోమేటిగ్గా తెలుసుకోగలుగుతాం. ఎక్కడ సమస్య ఉత్పన్నమైందో లోకేషన్‌తో కూడిన సమాచారం ప్రత్యేక యాప్‌ ద్వారా అధికారులకు తెలుస్తుంది. అధికారులు వెంటనే అప్రమత్తం కావడానికి ఈ సిస్టం ఉపయోగపడుతుంది. తద్వారా క్షేత్రస్థాయి ఉద్యోగుల ద్వారా సమస్య తలెత్తిన స్థలం వివరించి త్వరగా.. సమస్యను పరిష్కరించే విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించవచ్చు. ప్రస్తుతం ఏదైనా సమస్య ఏర్పడితే ఆ లైన్‌ మొత్తం పరిశీలించాల్సి వస్తోంది. దీంతో చాలా సమయం తీసుకోవడంతో కాలయాపన జరుగుతోంది. ఫీడర్‌ అవుటేజ్‌ మేనేజ్‌మెంట్‌ సిస్టం అమల్లోకి తీసుకొస్తే సమయం ఆదా కావడంతో పాటు త్వరితగతిన మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్‌ను పునరుద్ధరించగలుగుతాం.

స్థల సమస్య జటిలం..

కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థల సమస్య జటిలంగా మారింది. ఈక్రమంలో స్థల సమస్యను ఎదుర్కొనేందుకు ఇండోర్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్లు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాం. ముందుగా పైలెట్‌ ప్రాజెక్టులో భాగంగా హనుమకొండ, కరీంనగర్‌, ఖమ్మం, నిజామాబాద్‌ నగరాల్లో ఒక్కో సబ్‌ స్టేషన్‌ను నిర్మించనున్నాం. ఈ సబ్‌స్టేషన్లు కొత్తవి కావడంతో ఈమేరకు ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇస్తాం. పూర్తిగా అండర్‌ గ్రౌండ్‌ కేబుల్‌ వాడతాం. ఈవ్యవస్థపై అవగాహన కోసం శిక్షణ ఇవ్వనున్నాం. హైదరాబాద్‌, ముంబాయి , ఢిల్లీలో ఇండోర్‌ సబ్‌ స్టేషన్లున్నాయి. ఇండోర్‌ సబ్‌ స్టేషన్లతో తక్కువ స్థలంలోనే సబ్‌స్టేషన్‌ నిర్మించుకుని వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ సరఫరా అందించవచ్చు.

రేవంత్‌ టీ–20 మ్యాచ్‌ ఆడుతున్నారు

- సవాళ్లు, ప్రతి సవాళ్లు ఎదుర్కొంటూ ప్రజాపాలన సాగిస్తున్నారు
- స్టేషన్‌ ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సీఎంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

స్టేషన్‌ఘన్‌పూర్‌/జనగామ : అతిపిన్న వయసులో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి.. ఎన్నో అడ్డంకులు, అవాంతరాలు, వ్యక్తిగత దూషణలు ఎదుర్కొంటూ టెస్ట్‌, వన్డే మ్యాచ్‌లకు స్వస్తి పలికిన రేవంత్‌రెడ్డి.. పాలనలో టీ–20 మ్యాచ్‌ ఆడుతున్నారని స్టేషన్‌ ఘన్‌పూర్‌ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌ శివునిపల్లి రోడ్డులో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో ఎమ్మెల్యే కడియం మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా రోజుకు 16 గంటలు పని చేస్తున్న రేవంత్‌రెడ్డి.. సవాళ్లు, ప్రతి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజాపాలన సాగిస్తున్నారని కితాబిచ్చారు. స్టేషన్‌ఘన్‌పూర్‌ అభివృద్ధికి రూ.8 వందల కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఘన్‌పూర్‌లో అవినీతి, అక్రమ పాలన, పదవులు, పథకాలు అమ్ము కోవడం తప్ప గడిచిన పదిహేనేళ్లుగా అభివృద్ధి జరగలేదన్నారు.

వైద్య, విద్యారంగానికి పెద్దపీట : మంత్రి సురేఖ



బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కుప్పతో సర్కారుపై ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి వైద్య, విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కేసీఆర్‌ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో వరంగల్‌ను హైదరాబాద్‌తో సమానంగా అభివృద్ధి చేయాలని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన మాట ఎన్నడూ తప్ప లేదని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

కాంగ్రెస్‌ అంటే సంక్షేమం, అభివృద్ధి : మంత్రి సీతక్క



కాంగ్రెస్‌ అంటే సంక్షేమం, అభివృద్ధికి కేరాఫ్‌ అని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఉపాధి, మహిళల అభివృద్ధి, పేదలకు కూడు, గూడు, గుడ్డ అందించే ప్రభుత్వం తమదన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం 84వేల ఉద్యోగాలు కూడా ఇవ్వని దుస్థితి ఉంటే.. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల కాలంలోనే 55 వేల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపామన్నారు. ఇందిరమ్మ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు సంక్షేమం అందిస్తుంటే, బీఆర్‌ఎస్‌, బీజేపీ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నాయని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ అంటేనే అవినీతి, అక్రమాల ప్రభుత్వంగా చరిత్రలో పేరు లిఖించుకుందని ఎద్దేవా చేశారు. బీజేపీ కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు.

15 ఏళ్ల అభివృద్ధి..15 నెలల్లోనే : వరంగల్‌ ఎంపీ కావ్య



స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గంలో పదిహేనేళ్లలో జరగని అభివృద్ధిని కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా గెలిచిన 15 నెలల్లోనే రూ.8 వందల కోట్లు తీసుకొచ్చి చేస్తున్నారని, ఎమ్మెల్యే కడియం ప్రజలకు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని వరంగల్‌ ఎంపీ కడియం కావ్య అన్నారు. బూటకపు గుజరాత్‌ మోడల్‌ కాకుండా, తెలంగాణ రాష్ట్రాన్ని దేశాన్ని మోడల్‌గా చేస్తున్న ముఖ్యమంత్రికి మనమంతా అండగా నిలవాలన్నారు. ఉమ్మడి వరంగల్‌ అంటే రేవంత్‌ రెడ్డికి ప్రత్యేక అభిమానమని, మామునూరుకు ఎయిర్‌ పోర్టు తీసుకొచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కాజీపేట కోచ్‌ ఫ్యాక్టరీ కోసం ఢిల్లీకి వెళ్లి ఒత్తిడి చేస్తామన్నారు.

'టెన్నికాయిట్‌ ఉమెన్‌' విజేత అఖిల

- ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు..



విజేతలతో 'కుడా' చైర్మన్‌ వెంకట్రాంరెడ్డి, అసోసియేషన్‌ బాధ్యులు

వరంగల్‌ స్పోర్ట్స్‌: హనుమకొండ జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి సీనియర్‌ మెన్‌ అండ్‌ ఉమెన్‌ టెన్నికాయిట్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఇందులో మహిళా విభాగంలో హనుమకొండ క్రీడాకారిణి జి. అఖిల విజయం సాధించింది. ద్వితీయ స్థానంలో వరంగల్‌ క్రీడాకారిణి బి. జ్యోతి నిలిచింది. వరంగల్‌ జిల్లా టెన్నికాయిట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల ముగింపు వేడుకలకు 'కుడా' చైర్మన్‌ ఇనుగాల వెంకట్రాంరెడ్డి హాజరై విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జేఎన్‌ఎస్‌లో టెన్నికాయిట్‌ కోర్టు నిర్మాణానికి కావాల్సిన నిధుల మంజూరుకు సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్‌ అసోసియేషన్‌ కార్యదర్శి బీఎన్‌. వెంకటేశ్‌, శాట్‌ కోచ్‌ సద్గురు, అసోసియేషన్‌ హనుమకొండ, వరంగల్‌ జిల్లా కార్యదర్శులు అలువాల రాజ్‌కుమార్‌, గోకారపు శ్యాంకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు

పురుషులు	జిల్లా	మహిళలు	జిల్లా
ఎండి. యాసిన్‌	మహబూబ్‌నగర్‌	జి. అఖిల	హనుమకొండ
సుజియత్‌	మహబూబ్‌నగర్‌	బి.జ్యోతి	వరంగల్‌
డి. ప్రకాశ్‌	హనుమకొండ	జి. నవ్య	హనుమకొండ
జి.మధు	వరంగల్‌	జి.మమత	మహబూబ్‌నగర్‌

హూన్యాతండాలో మహిళ హత్య

- తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో భర్త.. ఆస్పత్రికి తరలింపు
- దంపతులు గొడవ పడి పరస్పరం దాడి చేసుకున్నారంటున్న పోలీసులు
- కలకలం సృష్టించిన ఘటన



బుజ్జి(ఫైల్‌)



రామా(ఫైల్‌)

డోర్నకల్‌: డోర్నకల్‌ మండలం హూన్యాతండాలో ఓ మహిళ హత్యకు గురైంది. ఆమె భర్త తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో చేరాడు. ఈ ఘటన ఆదివారం తండాలో కలకలం సృష్టించింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన భూక్యా బుజ్జి(51), రామా దంపతులు. వీరికి కుమారుడు అశోక్‌, కూతురు సౌందర్య ఉన్నారు. అశోక్‌ హైదరాబాద్‌లో ప్రైవేట్‌ ఉద్యోగం చేస్తుండగా, సౌందర్య హూన్యాతండా సమీపంలోని గార్ల మండలం పులిగడ్డ తండాలో భర్తతో నివాసం ఉంటుంది. శనివారం రాత్రి హోలీ వేడుకల్లో నృత్యం చేసిన బుజ్జి అనంతరం ఇంటికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటి నుంచి దంపతులు బయటకు రాలేదు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో రామా ఇంటి నుంచి తీవ్ర గాయాలతో బయటకు వచ్చి సమీపంలో పడిపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా బుజ్జి రక్తపు మడుగులో చనిపోయి ఉంది. డోర్నకల్‌ సీఐ బి.రాజేశ్‌, ఎస్సై గడ్డం ఉమ ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో ఉన్న రామాను మహబూబాబాద్‌ ఏరియా ఆస్పత్రికి తరలించారు. బుజ్జి హత్య విషయం తెలుసుకున్న కూతురు సౌందర్యతోపాటు చుట్టు పక్కల తండాలకు చెందిన ప్రజలు ఘటనాస్థలికి చేరుకున్నారు. మహబూబాబాద్‌ డీఎస్పీ తిరుపతిరావు తండాకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోలీసులను వివరాలు అగిడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ బి.రాజేశ్‌ మాట్లాడుతూ దంపతులు బుజ్జి, రామా శనివారం రాత్రి గొడవ పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో బుజ్జికి గొంతుపై తీవ్ర గాయమై మృతి చెందిందన్నారు. రామాకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారకస్థితికి చేరుకుని ఇంటి నుంచి బయటకు వచ్చి పడిపోయాడన్నారు. స్థానికుల సమాచారంతో రామాను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

రూ.630.27 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



రిమోట్‌తో వర్చువల్‌గా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌ రెడ్డి. పక్కన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

స్టేషన్‌ఘన్‌పూర్‌: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ నియోజకవర్గంలో రూ.630.27 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌ రెడ్డి సభావేదికపైనుంచే వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. విద్యాశాఖకు సంబంధించి జఫర్‌గఢ్‌ మండలం కోణాయిచలంలో రూ.200 కోట్లతో యంగ్‌ ఇండియా సమీకృత రెసిడెన్షియల్‌ పాఠశాల సముదాయం, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.5.5 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వైద్యారోగ్యశాఖకు సంబంధించి రూ.45. 5 కోట్లతో వంద పడకల ఆస్పత్రి, ఆర్‌అండ్‌బీ శాఖకు సంబంధించి రూ.26 కోట్లతో స్టేషన్‌ఘన్‌పూర్‌లో సమీకృత డివిజనల్‌ కార్యాలయాల సముదాయం, ఇరిగేషన్‌కు సంబంధించి రూ.148.76 కోట్లతో దేవాదుల కాల్వ సీసీ లైనింగ్‌ నిర్మాణం, పీఆర్‌ శాఖ ఆధ్వర్యంలో రూ.38.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం , ప్రజాపాలన గ్రామసభ మోడల్‌ గ్రామాల్లో రూ.250 కోట్లతో 5వేల ఇందిరమ్మ ఇళ్లు, రూ.12 కోట్లతో ఐదు సబ్‌స్టేషన్లు, ఒక డీఈ కార్యాలయ నిర్మాణం, రూ.24 కోట్లతో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా తండాలకు రోడ్లు, బంజారా భవన్‌ నిర్మాణం, స్టేషన్‌ఘన్‌పూర్‌ మున్సిపాలిటీ అప్‌గ్రేడేషన్‌, రూ.35 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం తదితర పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు.

మహిళా సంఘాలకు చెక్కుల పంపిణీ

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల మాఫీ కింద ఉమ్మడి వరంగల్‌లో 48,717 సంఘాలకు రూ. 92 కోట్ల 74 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా జనగామ జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ కింద రూ.వంద కోట్ల 93 లక్షలు చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు అందించారు. అదేవిధంగా జిల్లాలోని ఏడు మండలాలకు సంబంధించిన రూ.2.10 కోట్లతో మంజూరైన ఏడు ఇందిరా మహిళా శక్తి బస్సులను ప్రారంభించి వాటిని మహిళా సమాఖ్యలకు అప్పగించారు.

సీఎం సభలో తెలంగాణ ఉద్యమ కళాకారుల నిరసన



కళాకారులను లాక్కెళ్తున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్‌: స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలంలోని శివునిపల్లిలో ఆదివారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభలో తెలంగాణ ఉద్యమ కళాకారులు నిరసన తెలిపారు. సభా వేదికపై సీఎం ప్రసంగిస్తుండగా కళాకారులు మట్టెడ కలవేని రాణి, పుష్ప తదితరులు తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఫ్లెక్సీని ప్రదర్శించారు. దీంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు వారి వద్ద ఉన్న ఫ్లెక్సీని లాగేశారు. గమనించిన సీఎం వారిని వారించారు. కాగా, సీఎం ప్రసంగం అనంతరం ఉద్యమ కళాకారులు తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని నెట్టేశారు. ఈ క్రమంలో ఉద్యమ కళాకారులు, మహిళా పోలీసులకు మధ్య స్వల్ప పెనుగులాట జరిగింది. వారిని సభావేదిక నుంచి మహిళాపోలీసులు బలవంతంగా బయటకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడుతూ తాము శాంతియుతంగా తమ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చామని, పోలీసులు అత్యుత్సాహంతో తమపై దాడి చేశారన్నారు. ఈ దాడిలో ఫ్లెక్సీని చింపివేశారని, పుస్తెలతాడు తెంపారని, పుస్తెలతాడు లాకెట్‌తోపాటు ఒకరి గోల్డ్‌ రింగ్‌ పోయిందని వాపోయారు. తాము ప్రజాస్వామ్యయుతంగా సమస్యను తెలిపేందుకు వస్తే అడ్డుకోవడం సరికాదన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో 550 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పించారని, తెలంగాణ కోసం తాము పాటలు, ధూంధాంలతో ఉద్యమించామని, గుర్తించి ఉపాధి కల్పించాలని డిమాండ్‌ చేశారు. కళాకారులు పరకాల రమ, పుష్పలత, అడ్డూరి అంజలి, అలేఖ్య, రాణి, రమ, లావణ్య తదితరులున్నారు.

'రవాణా భత్యం' మంజూరు..

- ఒక్కో విద్యార్థికి రూ. 6వేలు
- త్వరలో అకౌంట్లలోకి..



విద్యారణ్యపురి : దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు ఎట్టకేలకు ఇటీవల రవాణా భత్యం మంజూరైంది. కిలోమీటర్‌ కంటే ఎక్కువ దూరం నుంచి ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు, 3 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉన్న యూపీఎస్‌లో చదువుకునే వారికి, 5కిలో మీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న హైస్కూల్‌లో చదివే విద్యార్థులకు ఈ రవాణా భత్యం అందజేస్తారు.

ఒక్కో విద్యార్థికి రూ. 6 వేలు..

ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి నెల ఒక్కో విద్యార్థికి రవాణా భత్యం రూ. 600 చొప్పున పది నెలలకు గాను రూ. 6వేలు మంజూరు చేశారు. జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్య, మంజూరైన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

హనుమకొండ జిల్లాలో..


- హనుమకొండ జిల్లాలో సమగ్ర శిక్ష పరిధి పాఠశాలల్లోని 704 మంది విద్యార్థులకు రూ. 42లక్షల 24వేలు, పీఎంశ్రీ–1 స్కూళ్లలోని 112 మంది విద్యార్థులకు రూ.6లక్షల 72వేలు, పీఎంశ్రీ –2దశలోని స్కూళ్లలోని 50మంది విద్యార్థులకు రూ. 3లక్షలు మంజూరు చేశారు.
- వరంగల్‌ జిల్లాలో వివిధ పాఠశాలల్లోని 507మంది విద్యార్థులకు రూ. 30లక్షల 42వేలు, పీఎం శ్రీస్కూళ్లలో 47మంది విద్యార్థులకు రూ.2లక్షల 82వేలు మంజూరయ్యాయి.
- జనగామ జిల్లాలో వివిధ పాఠశాలల్లోని 661మంది విద్యార్థులకు రూ. 39లక్షల 66వేలు, పీఎంశ్రీ–1 స్కూళ్లలోని 78మంది విద్యార్థులకు రూ. 4లక్షల 68వేలు మంజూరయ్యాయి.
- ములుగు జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 380 మంది విద్యార్థులకు రూ. 22లక్షల 80వేలు , పీఎంశ్రీ –1 స్కూళ్లకు చెందిన 45మంది విద్యార్థులకు రూ. 2లక్షల 70వేలు, పీఎంశ్రీ –2 స్కూళ్లకు చెందిన 38 మంది విద్యార్థులకు రూ. 2లక్షల 28వేలు మంజూరయ్యాయి.
- మహబూబాబాద్‌ జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 443మంది విద్యార్థులకు రూ. 26లక్షల 58వేలు, పీఎంశ్రీ స్కూళ్లకు సంబంధించిన 30మంది విద్యార్థులు రూ. లక్షా 80 వేలు మంజూరయ్యాయి.
- జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో వివిధ పాఠశాలలకు చెందిన 367మంది విద్యార్థులకు రూ. 22లక్షల 2వేలు, పీఎంశ్రీ –1 కు సంబంధించిన స్కూళ్లకు చెందిన 64మంది విద్యార్థులకు రూ. 3లక్షల 84వేలు మంజూరయ్యాయి.

విద్యార్థుల అకౌంట్లలోకి నిధులు..

ఉమ్మడి వరంగల్‌జిల్లాలోని ఆయా ఆరు జిల్లాల జిల్లా విద్యాశాఖాధికార్యాలయాలకు ఇటీవల సమగ్రశిక్ష నుంచి విద్యార్థుల రవాణా భత్యం నిధులు మంజూరయ్యాయి. ఆయా జిల్లాల విద్యాశాఖాధికారులు కలెక్టర్ల అప్రూవల్‌ తీసుకుని విద్యార్థుల వ్యక్తిగత అకౌంట్లలోకి జమచేస్తారు. పాఠశాలల హెచ్‌ఎంలు విద్యార్థుల జాబితాను డీఈఓలకు పంపినప్పుడే ఆయా విద్యార్థుల వ్యక్తిగత అకౌంట్లను కూడా పంపారు. అయితే అక్కడక్కడ కొంతమంది విద్యార్థులకు అకౌంట్లు లేవని తెలుస్తోంది. అయితే ఆయా విద్యార్థులకు వారి హెచ్‌ఎంల ద్వారా తల్లిదండ్రులకు విద్యార్థుల పేరుమీద బ్యాంకు అకౌంట్లు తీసి పంపాలని అధికారులు సూచించారని సమాచారం. ఈనెలాఖరులోపే విద్యార్థుల అకౌంట్లలోకి ఆ నిధులు జమ చేస్తారు. కాగా, రెండేళ్లుగా విద్యార్థులకు రవాణా భత్యం నిధులు మంజూరు కాలేదు. ఈ క్రమంలో ఎట్టకేలకు ఈ విద్యాసంవత్సరానికి నిధులు విడుదలయ్యాయి.

వాజ్‌పేయిని స్ఫూర్తిగా తీసుకోవాలి

- మాజీ గవర్నర్‌, కేంద్ర మాజీ మంత్రి సి.హెచ్‌.విద్యాసాగర్‌ రావు



మాట్లాడుతున్న మాజీ గవర్నర్‌ విద్యాసాగర్‌ రావు

హన్మకొండ: మాజీ ప్రధాన మంత్రి అటల్‌ బిహారి వాజ్‌పేయిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ గవర్నర్‌, కేంద్ర మాజీ మంత్రి సి.హెచ్‌.విద్యాసాగర్‌ రావు అన్నారు. ఆదివారం హనుమకొండ హంటర్‌ రోడ్డులోని 'డి' కన్వెన్షన్‌లో 'అటల్‌ జీ యాదిలో' ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో సి.హెచ్‌.విద్యాసాగర్‌ రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 1975లో కరీంనగర్‌లో జరిగిన బహిరంగ సభలో అటల్‌ బిహారీ వాజ్‌పేయి ప్రసంగాన్ని నాటి తరం నాయకులు, ప్రజలు ఇప్పటికీ గుర్తు చేస్తారన్నారు. ఆయన ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకునేలా సాగేదన్నారు. హిందీ భాషలో పద బంధాలు కూర్చి, పేర్చి మాట్లాడేవారన్నారు. దేశంలో అన్ని పార్టీలు దేశహితం కోసం ఒకటిగా ఉండాలని ఆలోచించాలనేవారన్నారు.దేశంలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లాలని కోరుకునేవారన్నారు. ప్రధానిగా దేశంలో అనేక అభివృద్ధి పథకాలు చేపట్టారని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సీట్లు గెలుచుకుని అధికారంలోకి రావాలని, ఈ దిశగా పార్టీ శ్రేణులు శ్రమించాలన్నారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లాలోనూ అత్యధిక సీట్లు కైవసం చేసుకోవాలన్నారు. అటల్‌ బిహారీ వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల ఉమ్మడి వరంగల్‌ జిల్లా కన్వీనర్‌ సీతారాం నాయక్‌ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్‌ జిల్లాతో అటల్‌ బిహారి వాజ్‌పేయికి అవినాభావ సంబంధముందన్నారు. చాలాసార్లు పర్యటించారన్నారు. ఈ ప్రాంత వ్యక్తులు వాజ్‌పేయితో ఉన్న సంబంధాలు, ఫొటోలు, టెలిగ్రాంలు, శుభాకాంక్షలు వంటివి ఉంటే తమకు చేరవేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టి.రాజేశ్వర్‌ రావు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌, పార్టీ హనుమకొండ, వరంగల్‌ జిల్లాల అధ్యక్షులు కొలను సంతోశ్‌ రెడ్డి, గంట రవికుమార్‌, నాయకులు కన్నెబోయిన రాజయ్య యాదవ్‌, మంద ఐలయ్య, నాగపురి రాజమౌళి గౌడ్‌, దేవేందర్‌ రెడ్డి, నిశిధర్‌ రెడ్డి, బలరాం, చాడ శ్రీనివాస్‌ రెడ్డి, రావుల కిషన్‌, చందుపట్ల కీర్తి, చాడ స్వాతి, ఆర్‌.పి.జయంత్‌లాల్‌, తదితరులు పాల్గొన్నారు.